సాక్షి
జనగామ
గురువారం । 11 । జనవరి । 2024



వేతన సవరణ చేపట్టాలి

ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ చేపట్టాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ డివిజన్ బాధ్యులు డిమాండ్ చేశారు. - 8లో▸



మేడారం.. శరవేగం

మేడారం మహాజాతరకు సమయం దగ్గరపడుతోంది. ఈ మేరకు జాతర అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం

ఉదయం పొగమంచు కారణంగా చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వైభవంగా మాస కల్యాణం



పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో బుధవారం చండికా సమేత శ్రీ సోమేశ్వరస్వామి వారికి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కనులార తిలకించి తరించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



కొడకండ్ల: ఆరు నుంచి పదోతరగతి చదివే విద్యార్థుల్లో తరగతుల వారీగా అభ్యసన సామర్థ్యాలు పెంచాలని డీఈఓ రాము అన్నారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో జిల్లా 'ఉన్నతి' ప్యానల్ టీం రఘూజీ ఆధ్వర్యంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించగా.. డీఈఓ తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య సాధనకు ఉపాధ్యాయులు పనిచేయాలని ఈ సందర్భంగా డీఈఓ సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ గ్రేస్ కేజియారాణి తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు ఎంపిక

జనగామ రూరల్: జాతీయ స్థాయి యువజన ఉత్సవాలకు జనగామ నుంచి ఇద్దరు యువకులు ఎన్నికయ్యారని జిల్లా యువజన క్రీడల అధికారి కె.రంగాచారి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 23న జిల్లాలో నిర్వహించిన యుజనోత్సవ పోటీల్లో స్టోరీ రైటింగ్ విభాగం నుంచి గొడుగు మనోహర్(స్టేషన్‌ఘన్‌పూర్ జూనియర్ కళాశాల), ఫొటోగ్రఫీలో ఆలకుంట్ల దివ్య(ఎంజేపీ కొడకండ్ల) ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారు హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యుజనోత్సవాల్లో ప్రతిభ కనబర్చి నాసిక్‌లో ఈనెల 12 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

చౌరస్తాలో ఆగిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం



జనగామ: పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా ఫౌంటెయిన్ సమీపంలో బుధవారం రాత్రి సాంకేతిక లోపంతో ఓ లారీ ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఎస్సై తిరుపతి చేరుకుని లారీని పక్కకు తొలగించేందుకు విశ్వప్రయత్నం చేశారు. బీఎస్6 వాహనం కావడంతో టెక్నీషియన్ వచ్చే వరకు లారీ స్టార్ట్ కాదని చెప్పారు. దీంతో చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టారు.

సమన్వయంతో నేరాల్ని కట్టడి చేద్దాం



వరంగల్ క్రైం: స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు సమన్వయంతో పని చేస్తే నేరాల్ని నియంత్రించడం మరింత సులభం అవుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గంజాయి రవాణా, విక్రయాల్ని నియంత్రించడంలో కృషి చేస్తున్న కాజీపేట, వరంగల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు ఎం.సంజీవరావు, టీఎస్ఆర్ కృష్ణకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఇరు విభాగాల పోలీసులు సమన్వయంతో పని చేస్తూనే.. నేరగాళ్ల సమాచారాన్ని పంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని నేరాల్ని నియంత్రించేందుకు కలిసి పని చేద్దామని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ యం.జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.దేవేందర్ పాల్గొన్నారు.

'ప్రయోగం' చేసేదెలా..!

నాలుగేళ్లుగా నిధుల కొరత

- కానరాని పరికరాలు, రసాయనాలు
- ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- జూనియర్ కాలేజీలు, కేజీబీవీల్లో అరకొర పరీక్షలతో హాజరు
- జిల్లాలో సెకండియర్ విద్యార్థులు 1,187 మంది



ధర్మకంచ కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

జనగామ రూరల్: ఇంటర్ పరీక్షలకు కనీసం రెండు నెలల గడువు కూడా లేదు. అయితే అంతకు ముందే ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులను ప్రయోగ పరీక్షలకు సంసిద్ధులను చేసిన తదుపరి ప్రాక్టికల్స్ నిర్వహించాలి. ప్రభుత్వం ఇప్పటికే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షల నిర్వహణకు అనేక ఇబ్బందులు ఉన్నాయి. ఇంటర్ విద్యలో నైపుణ్యాలను ప్రదర్శించే ప్రాక్టికల్ పరీక్షలకు నిధులు మంజూరు లేకపోవడంతో విద్యార్థులతో ఉపాధ్యాయులు ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో వచ్చే మార్కులు కోల్పోయే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఆరు కేజీబీవీలు, గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో 12 మోడల్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. వీటిలో సెకండియర్ విద్యార్థులు 1,187 మంది ఉన్నారు.

ప్రయోగాలే కీలకం

ఇంటర్ విద్యలో సైన్స్ విద్యార్థులకు థియరీతో పాటు ప్రాక్టికల్స్ చాలా కీలకం. చదువుకున్న పాఠ్యాంశాన్ని ప్రాక్టికల్‌గా నిరూపించాల్సి ఉంటుంది. మొదటి ఏడాదిలో సర్దుకున్నా.. ద్వితీయ సంవత్సరంలో ప్రాక్టికల్స్ చేయించాల్సి ఉంటుంది. గడువు తక్కువ ఉండడం, రసాయనాలు లేక ప్రాక్టికల్స్ సక్రమంగా జరగడం లేదు. ప్రతి సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలకు ముందే నిధులు విడుదల చేసి సంబంధించిన పరికరాలు, రసాయనాలు కొనుగోలు చేయాల్సి ఉండగా చాలా కళాశాల్లో పాత వాటితోనే నెట్టుకొస్తున్నారు.

నాలుగేళ్లుగా అవస్థలు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సబ్జెక్టుల్లో ప్రయోగాలు చేయాల్సి ఉంది. 2014 సంవత్సరానికి ముందు సైన్స్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఫీజు వసూలు చేసి అవసరమైన పరికరాలు, రసాయనాలు కొనేవారు. 2015లో అప్పటి ప్రభుత్వం ఉచిత విద్య అందస్తామని ప్రకటించడంతో అన్ని రకాల ఫీజుల వసూలు నిలిపివేశారు. తరువాత రెండు సంవత్సరాలు నిధులు విడుదల చేసిన సర్కారు.. కరోనా అనంతరం విడుదల చేయలేదు. దీంతో ప్రాక్టికల్స్‌కు నిధుల కొరత ఏర్పడింది. విద్యార్థులకు కనీస పరిజ్ఞానం అందించడానికి అధ్యాపకులు ప్రత్యేక చొరవ చూపి తరగతులు నిర్వహిస్తే తప్ప కొనసాగే పరిస్థితి లేదు.

రసాయనాలు, సామగ్రి కొరత

జిల్లా, మండల కేంద్రాల్లోని జూనియర్ కళాశాల్లో ప్రాక్టికల్స్ తరగతులు లేక విద్యార్థుల అభ్యసనకు ఆటంకం ఏర్పడుతోంది. ప్రయోగశాలలో బ్యూరెట్, పిప్పెట్, కోనికల్ ఫ్లాస్క్ వంటి పరికరాలు సరిపడా లేవు. హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లం, నత్రికామ్లం వంటివి కాలం చెల్లినవి ఉన్నాయి. కొన్ని కళాశాల్లో అవికూడా లేవు. జీవశాస్త్ర ప్రయోగాలకు క్రోమటోగ్రఫీలోని ఎసిటోన్, ఇథైల్ ఆల్కహాల్, ఫినాప్తలియన్, పెట్రోలియం, ఈథర్ వంటివి లేవు.

కెమికల్స్ అందుబాటులో లేవు



కళాశాలలో ల్యాబ్ సౌకర్యం ఉన్నా ప్రయోగాలు చేసేందుకు పూర్తి స్థాయిలో కెమికల్స్ అందుబాటులో లేవు. కొత్తగా వచ్చినవి కూడా లేవు. పాత వాటితోనే ప్రయోగాలు చేస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రయోగ పరికరాలు, కెమికల్స్ అందుబాటులో ఉండేలా చూడాలి.

- శంకర్, విద్యార్థి ధర్మకంచ జూనియర్ కళాశాల, జనగామ

కెమికల్ రియాక్షన్ ఇవ్వడంలేదు



చాలా వరకు ల్యాబ్‌లో గతంలో ఇచ్చిన రసాయనాలు ఉండడం వల్ల ప్రయోగం చేసినా కెమికల్ రియాక్షన్ ఇవ్వడం లేదు. రోజూ చేసే ప్రాక్టికల్స్‌లో మంచి మార్కులు వచ్చేవి. ప్రస్తుతం అలా ఉండే పరిస్థితి లేదు.

- శ్రావణి, విద్యార్థిని, ధర్మకంచ జూనియర్ కళాశాల, జనగామ

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

గతంలో ప్రాక్టికల్స్‌కు సంబంధించి రసాయనాలు ప్రభుత్వం పంపిణీ చేసింది. ల్యాబ్‌లో పలు సమస్యలు ఉన్నాయి. ప్రయోగాలకు రసాయనాలు, పరికరాలు లేవని, అవసరమైన ఇండెంట్ సిద్ధం చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- బైరి శ్రీనివాస్, డీఐఈఓ

సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పల్లా'

జనగామ రూరల్/బచ్చన్నపేట: వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా సమన్వయంతో పనిచేద్దామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం యశ్వంతాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ ఆధ్వర్యాన, బచ్చన్నపేటలో బొడిగం చెంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసే విధంగా మన పోరాటం ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 12న హైదారాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగే విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యులు హాజరు కావాలన్నారు. సంక్రాంతి తరువాత పార్టీ నియోజకవర్గ శ్రేణులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యలపై దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ సమావేశాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, పసుల ఏబేల్, బండ పద్మయాదగిరిరెడ్డి, ముస్త్యాల దయాకర్, జూకంటి లక్ష్మీశ్రీశైలం, చెంచార పల్లవి, నీల యాదగిరి, గుర్రం నాగరాజు, రావేల రవి, రైతు బంధు సమితి మాజీ జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వసూనూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చిదురాల బాబు, పిట్టల విశ్వనాథం, కోశాధికారి ఇంగే ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు సీహెచ్ఎస్.చారి, వైద్యం ప్రభాకర్, ఐలయ్య, యాదగిరి, రామూర్తి, సోమలింగం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జనగామ: పట్టణంలోని ధర్మకంచ ప్రాంతానికి చెందిన నాగిండ్ల హేమలత భర్త నాగరాజుకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.1.50 లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందజేశారు. నాగరాజుకు పక్షవాతం రాగా నిమ్స్‌లో అడ్మిట్ చేశారు. వైద్య పరీక్షలకు రూ.3లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో బాధితులు ఎమ్మెల్యేను సంప్రదించగా ఎల్‌ఓసీ కోసం ప్రభుత్వానికి పంపించడంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఆ చెక్కును హేమలతకు అందించగా ఆమె ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జాతీయ నూతన విద్యావిధానం రద్దు చేయాలి



రైల్వే స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు

జనగామ రూరల్: కేంద్రం అమలు చేయాలని భావిస్తున్న నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. అందరికీ విద్యా, అందరికీ ఉపాధి అనే డిమాండ్‌తో పార్లమెంట్ వద్ద ఈనెల 12న 15 లౌకిక విద్యార్థి సంఘాలతో చేపట్టే పార్లమెంట్ ముట్టడికి బుధవారం జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి విద్య, విలువలు, అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో సాధ్య కాదన్నారు. ఈ విద్యావిధానం వల్ల కోర్సులు, సిలబస్ పరీక్షలు సులభతరం అవుతాయని, అయితే పరీక్షలు సులభతరం చేస్తే మార్కులు వేసే వారి దుర్వినియోగాన్ని ఎలా అరికట్టాలో ఈపాలసీ చర్చించలేదన్నారు. విద్యా ఉమ్మడి జాబితా ఉంటే దానిని పూర్తిగా కేంద్రం చేతుల్లోకి వెళ్లేలా పాలసీ ఉందని విమర్శించారు. ఢిల్లీ వెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షుడు సందీప్, యాకన్న, విశాల్, మహేష్, స్రవంతి అభినయ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



రఘునాథపల్లిలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్

రఘునాథపల్లి: రైస్ మిల్లర్లు సీఎంఆర్ లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. బుధవారం మండల పరిధి ఖిలాషాపూర్ రైస్ మిల్లును తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా, జాప్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు నమోదు చేశారు, ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీసీఎస్ఓ రోజారాణి, విజయడైరీ స్పెషల్ ఆఫీసర్ ధనరాజ్, డీటీ శ్రీనివాస్, ఎంపీడీఓ హసీం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 2024 న్యూ ఇయర్ డైరీ, క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ శివలింగయ్య తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రెజరీ అధికారి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరిబాబు, మహబూబ్, జగదీశ్వరాచారి, బత్తోజు ఆంజనేయులుచారి, లక్ష్మీనారాయణ, అఫ్జల్, జబ్బార్, జానీమియా, భిక్షపతి, లతీఫ్, రియాజుద్దీన్, ప్రేమ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రమేష్, సోమయ్య, హేమలత, రాంరెడ్డి, రామన్న పాల్గొన్నారు.

ఘన్‌పూర్ ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

- సమావేశానికి ఎంపీటీసీల గైర్హాజరు
- అవిశ్వాస నోటీసు రద్దు : ఆర్డీఓ
- నెలరోజుల సస్పెన్స్‌కు తెర



ఎంపీటీసీలు హాజరుకాక ఖాళీగా ఉన్న కుర్చీలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కందుల రేఖగట్టయ్యపై అవిశ్వాసం వీగింది. అవిశ్వాసం కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరుకాలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యుల సంతకాలతో కూడిన దరఖాస్తును డిసెంబర్ 16న ఘన్‌పూర్ ఆర్డీఓ వాసం రామ్మూర్తికి అందజేసిన విషయం తెలిసిందే. నిబంధనల మేరకు ఆర్డీఓ మండల పరిధి ఎంపీటీసీలకు ఈనెల 10న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవిశ్వాసం సమావేశం ఉంటుందని, హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు అవిశ్వాస సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులుండగా మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా ఒక్కరు కూడా హాజరుకాలేదు.

అవిశ్వాస నోటీసు రద్దు

ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గాలంటే నిబంధనల మేరకు 2/3 ఎంపీటీసీలు(10 మంది) హాజరు కావాల్సి ఉంటుందని, అయితే ఒక్కరు కూడా రాకపోవడంతో నిబంధనల మేరకు ఎంపీపీపై అవిశ్వాస నోటీసును రద్దు చేస్తున్నట్లు ఆర్డీఓ ప్రకటించారు. దీంతో నెల రోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. సమావేశంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, డీఓ క్రాంతి, సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పండితులకు పదోన్నతులు కల్పించాలి

- ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు శంకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: పండితులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ములుకనూరి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్‌యూపీపీ టీఎస్ ఆధ్వర్యంలో కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన సంవత్సర క్యాలెండర్లను నోడల్ ఆఫీసర్ ఎండీ.పర్వేజ్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. కొన్నేళ్లుగా పండితులు ఉన్నత పాఠశాలల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారని, సర్వీస్ మొత్తం పూర్తయ్యే సరికి ఒక్క ప్రమోషన్ కూడా తీసుకోకుండా అదే కేడర్లో ఉద్యోగ విరమణ పొందుతున్నారన్నారు. గత ప్రభుత్వం అనేక జీఓలు తీసుకొచ్చినా న్యాయం జరగలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, చంద్రమోహన్, రవి, గిరిజాకుమారి, ప్రభాకర్, స్వరూపరాణి, రాజేందర్, అనిల్‌కుమార్, వేణుగోపాల్, విజయ, సిరాజ్ కరుణశ్రీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీ హబ్‌కు సిబ్బంది కావలెను!

- ప్రారంభమై ఏళ్లు, నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో లేని సిబ్బంది
- రేడియాలజిస్టులు, పాథాలజిస్టులు, బయోకెమిస్ట్రీ వైద్యుల కొరత
- గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం సిబ్బందిని పెంచాలంటూ డిమాండ్
- ఉమ్మడి వరంగల్‌లోని ఆరు హబ్‌ల్లోనూ ఇదే పరిస్థితి..
- ఉన్నతాధికారుల బృందం పర్యటన నేపథ్యంలో తెరపైకి సమస్యలు
- మంత్రులు కొండా సురేఖ, సీతక్క దృష్టి సారిస్తే మరింత బలోపేతం



జనగామలో..

2021 జూన్ 14న రూ.3.50 కోట్ల వ్యయంతో అన్ని వసతులతో జనగామలో డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 134 రకాల పరీక్షలు చేసి రిపోర్టులు ఇస్తున్నారు. మొత్తంగా 22 మంది సిబ్బంది అవసరం ఉండగా 10 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. బయోకెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ, రేడియాలజిస్టు, పాథాలజీ వైద్యుల అవసరం ఉంది. జనగామ మాత శిశు సంరక్షణ కేంద్రం డయాగ్నోస్టిక్ సెంటర్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రక్త పరీక్షలకు గర్భిణులను అక్కడి నుంచి ఇక్కడికి పంపిస్తున్నారు ఎంసీహెచ్ లోనే 20 టెస్టులు చేసే విధంగా అవకాశం కల్పించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

జిల్లాల వారీగా సేకరించిన రక్త నమూనాలు, చేసిన పరీక్షల వివరాలు

జిల్లా	నమూనాలు	పరీక్షలు
వరంగల్	14,775	27,152
హనుమకొండ	19,500	50,000
ములుగు	2,41,840	3,48,426
మహబూబాబాద్	1,66,576	4,92,495
జనగామ	1,59,691	4,87,540
జేఎస్.భూపాలపల్లి	33,108	94,590

సాక్షి, వరంగల్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవల కోసం ప్రారంభించిన తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌లను సిబ్బంది కొరత వేధిస్తోంది. వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో లేక రోగుల సేవల్లో కాస్త ఆలస్యమవుతోంది. ఉమ్మడి వరంగల్‌లోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాలోని అన్ని డయాగ్నోస్టిక్ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో ఇప్పటికే 57 రకాల వైద్య నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా, జనగామలో మాదిరిగా 134 రకాల నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రకమైన పరీక్షల వల్ల పేద రోగులు ప్రైవేట్‌కు వెళ్లే బాధలతోపాటు పైసల తిప్పలు తప్పుతాయని అంటున్నారు. తాజాగా ములుగు జిల్లా ఏటూరునాగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటుపై క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆ విభాగ ఉన్నతాధికారులు వస్తుండడంతో ఇప్పటికే ఉన్న వాటిలో సిబ్బంది కొరతపై దృష్టి సారించి నియమించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలంటున్నారు. అదే సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు మంత్రులుగా ఉన్న కొండా సురేఖ, సీతక్కలు కూడా చొరవ చూపి దయాగ్నస్టిక్ కేంద్రాలను ఇంకా బలోపేతం చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.

పీహెచ్‌సీల నుంచి హబ్‌లకు..

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి ప్రత్యేక వాహనాల ద్వారా ఈ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు పంపుతున్నారు. వాటిని పరీక్షించి సదరు రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేసి రోగికి అందేలా చూస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సరైన సిబ్బంది లేక రిపోర్టులు ఆలస్యంగా వెళుతున్నాయి. ఎల్‌ఎఫ్‌టీ, కిడ్నీ, లివర్, థైరాయిడ్‌లకు సంబంధించిన బయో కెమిస్ట్రీ, బ్లడ్ లెవల్స్ ఎంత మేరకు ఉన్నాయనే వివరాలను తెలుసుకునే పాథాలజీ పరీక్షలు, టైఫాయిడ్, మలేరియా, డెంగీలకు సంబంధించి పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు ఈ కేంద్రాల్లో చేస్తున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి వరంగల్‌లో 6,35,490 మంది నుంచి సేకరించిన రక్త నమూనాలతో 25,00,203 పరీక్షల రిపోర్టులు ఇచ్చారు.

నర్సంపేటలో సిబ్బంది కొరతే..

2023 జూలై ఒకటిన వరంగల్ జిల్లా నర్సంపేటలో ప్రారంభమైన తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌లో 57 రకాల నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. రూ.1.25 కోట్లతో ఈ కేంద్రాన్ని నిర్మించగా వివిధ రకాల పరీక్షలకు అవసరమయ్యే పరికరాలకు రూ.కోటితో సమకూర్చారు. ఇక్కడ నలుగురు వైద్యులు ఉండాలి. కానీ ఇద్దరే ఉన్నారు. బయోకెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ వైద్యులు లేరు. ఇద్దరు రేడియాలజిస్టులు, ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక ల్యాబ్ మేనేజర్, ఫార్మసిస్ట్ ఒకరు, డీఈఓ ఒకరు ఉన్నారు. మరో పది మంది ల్యాబ్ టెక్నీషియన్లు అవసరం ఉంది. బయోకెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ వైద్యులను ప్రభుత్వం నియమించలేదు. ఈ రిపోర్టులను స్టేట్ టీం మానిటరింగ్ చేస్తుంది. 2డీ ఏకో ఉంది. కానీ దానికి సంబంధించిన డాక్టర్, టెక్నీషియన్‌ను నియమించలేదు.

హనుమకొండలో..

హనుమకొండ చౌరస్తాలోని ప్రసూతి ఆస్పత్రిలో 2023 మార్చిలో రూ.1.25కోట్లతో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. 57 రకాల పరీక్షలు చేస్తున్నారు. 134కు పరీక్షలు పెంచాల్సిన అవసరం ఉంది. నలుగురు వైద్యులతో పాటు 13 మంది సిబ్బంది ఉన్నారు. మరో రేడియాలాజిస్టు అవసరం ఉందని ఇక్కడి సిబ్బంది చెబుతున్నారు.

ములుగులో..

ములుగులో సుమారు రూ2.50 కోట్ల వ్యయంతో దయాగ్నోస్టిక్ హబ్ 2021 జనవరి 28న అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ 134 రకాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, 84 పరీక్షలు చేస్తున్నారు. 134కు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ కేంద్రంలో నలుగురు వైద్యులు ఉండాలి. కానీ... పాథాలజీ వైద్యుడు మాత్రమే ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు ఆరుగురు మాత్రమే ఉన్నారు. మరో 10 మంది ల్యాబ్ టెక్నీషియన్లు అవసరం ఉంది. బయోకెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ, రేడియాలజీ వైద్యులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం లేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు.

మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోనే రూ.రెండు కోట్లకు పైగా వ్యయంతో 2021, మే 17 నుంచి డయాగ్నోస్టిక్ హబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ 108 రకాల టెస్టులు చేస్తున్నారు. సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ అందుబాటులో ఉంది. బయోకెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ, రేడియాలజిస్టు, పాథాలజీ వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఇక్కడి అవసరాల నిమిత్తం మరో రేడియాలజిస్టు కావాలి. ఎనిమిది మంది ల్యాబ్ టెక్నీషియన్స్, ఒక ల్యాబ్ మేనేజర్ ఉన్నారు. మరో నలుగురు సిబ్బంది అవసరమని ఇక్కడి కేంద్రం వారు అంటున్నారు.

భూపాలపల్లిలో..

భూపాలపల్లిలో రూ.1.25 కోట్ల వ్యయంతో 2023 మే ఒకటిన తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 57 రకాల నిర్ధారణ పరీక్షలకు గానూ 54 నిర్వహిస్తున్నారు. 13 పీహెచ్‌సీలు, 2 సీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి నుంచి రక్త నమూనాలు సేకరించి హబ్‌కు పంపిస్తున్నారు. ఇక్కడ తగినంత సిబ్బంది ఉన్నారని, రక్త పరీక్షలు చేసుకునే వారి సంఖ్య పెరుగుతుండడంతో ల్యాబ్‌లో మరో ముగ్గురి అవసరం ఉందని అంటున్నారు.

లబ్ధిదారులు వివరాలు అందజేయాలి

జనగామ రూరల్: జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం పొందిన వెనుకబడిన తరగతుల కుల వృత్తులు, చేతివృత్తుల లబ్ధిదారులు తమ వివరాలు అందజేయాలని బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్ ఒక ప్రకటనలో కోరారు. రుణాలతో కొనుగోలు చేసిన యంత్రాల వివరాలు, ఫొటోలు, వాటికి సంబంధించిన రశీదులు 10 రోజుల్లోగా కార్యాలయంలో సమర్పించాలని, లేని పక్షంలో రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

క్లుప్తంగా

సొసైటీ ఫర్ రీసెర్చ్ ప్లాంట్ ప్రెసిడెంట్‌గా రామస్వామి


రామస్వామి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం అడ్జెంట్ ఆచార్యుడు ఎస్ రామస్వామి సొసైటీ ఫర్ రీసెర్చ్ ప్లాంట్‌కు (సొత్) ప్రెసిడెంట్‌గా అర్హత సాధించారు. దీనికి సంబంధించి ఆ సంస్థ ఫౌండర్ చైర్మన్, సెక్రటరీ జనరల్ ఆచార్య ఎస్‌కె భట్నాగర్ నుంచి మెయిల్ ద్వారా సమాచారం అందినట్లు రామస్వామి బుధవారం తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన సొసైటీ ఫర్ రీసెర్చ్ ప్లాంట్ నుంచి గొప్ప పరిశోధన, ప్రచురుణలు స్ప్రింగర్ గ్రూప్ ద్వారా వస్తాయి. రామస్వామికి బాటనీ, బయోటెక్నాలజీ విభాగాల్లో విస్తృత పరిశోధనలు, పరిశోధనాపత్రాల సమర్పణ అనుభవం ఉంది. ఈ పదవిలో 2024 నుంచి 2026 వరకు కొనసాగుతారు.

ఉపకార వేతనానికి బయోమెట్రిక్ ధ్రువీకరణ

విద్యారణ్యపురి: జిల్లాలోని విద్యార్థులు ఎలాంటి ఉపకార వేతనం పొందాలన్నా.. సంబంధిత స్కూళ్లు, కళాశాలల ఇన్‌స్టిట్యూషన్స్, ఇన్‌స్టిట్యూట్ నోడల్ అధికారి బయోమెట్రిక్ ధ్రువీకరణ తీసుకోవాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 12లోగా.. సీఎస్‌సీ ఆన్‌లైన్ సెంటర్ 8686079289 గోపాల్‌పూర్ హనుమకొండలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. దీనికిగాను హెచ్ఓఐ, ఐఎన్ఓలు వారి ఆధార్ కార్డుతో రావాల్సి ఉంటుందని సూచించారు. లేకపోతే వారి పాఠశాలల, కళాశాలల ఉపకార వేతన దరఖాస్తుల్ని పరిశీలించడం వీలుకాదని స్పష్టం చేశారు.

కార్పొరేటర్ సురేష్‌పై రెండు కేసులు నమోదు

- అప్పు ఇవ్వకుండా బెదిరించిన ఘటనలో ఒకటి
- చిట్టీ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఘటనలో మరోటి..

రామన్నపేట : వరంగల్ 26వ డివిజన్ కార్పొరేటర్ బాలిన సురేష్‌పై బుధవారం రెండు కేసులు నమోదు చేసినట్లు ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. కార్పొరేటర్ బాలిన సురేష్ గిర్మాజీపేటలో తైలం గౌతమ్ సాగర్ అనే వ్యక్తి వద్ద తన ఇంటిని కుదువపెట్టి, విక్రయ అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఈ అగ్రిమెంట్ మేరకు రూ. 54 లక్షలు అప్పుగా తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరించాడు. దీంతో గౌతమ్ సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిట్టీ డబ్బులు ఇవ్వకుండా బెదిరించిన ఘటనలో మరో కేసు..

కార్పొరేటర్ బాలిన సురేష్ అంగీకార ఒప్పంద చిట్టీలు నడిపిస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న క్రమంలో మరో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. 2021 సంవత్సరం నుంచి గాలిపల్లి శ్రవణ్‌కుమార్‌కు రూ.12 లక్షలు, రూ. గౌతమ్ సాగర్‌కు 20 లక్షలు, శ్రీరామోజు రాజుకు రూ.6.25 లక్షలు, దస్తగిరికి రూ. 6 లక్షలు, తంగళ్లపల్లి పావనికి రూ. 3.12 లక్షలు, శ్రీరామోజు యుగేంధర్‌కు రూ. 2.70 లక్షలు, రామగిరి మహేష్‌కుమార్‌కు రూ.7 లక్షలు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తున్నాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

మేడారం.. శరవేగం..

ఊపందుకున్న జాతర అభివృద్ధి పనులు

- దగ్గరుండి పర్యవేక్షిస్తున్న అధికారులు
- వివిధ పనులతో సందడిగా మారుతున్న పరిసరాలు



ఎస్ఎస్‌తాడ్వాయి : కోట్లాది మంది భక్తులు హాజరయ్యే మేడారం మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. అయితే జాతరకు ఇంకా 40 రోజుల సమయమే మిలిగి ఉన్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఆయాశాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు ఊపందుకుంటున్నాయి. అధికారులు మేడారంలోనే ఉంటూ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లను పురమాయిస్తున్నారు. అలాగే, హైదరాబాద్‌లో మంత్రులు సీతక్క, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్.. మేడారం జాతరపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడంతో పనుల్లో మరింత వేగం పుంజుకుంది.

జంపన్నవాగులో ఇసుక లెవలింగ్ పనులు



మేడారం జంపన్న వాగులో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇసుక చదును పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జంపన్నవాగు స్నాన ఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాబ్స్ ఏర్పాటు కోసం మెటీరియల్ డంప్ చేశారు. అలాగే, ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడిక తీస్తున్నారు. జంపన్నవాగులో ఇసుక లెవలింగ్ పనులు చేస్తున్న యంత్రాలతో సందడి నెలకొంది.

రోడ్ల పనుల్లో వేగం



మేడారంలో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. జంపన్నవాగు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. భక్తుల వాహనాల రాకపోలకు ఇబ్బందులు కలగకుండా కంకర పోసి రోలింగ్ చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ క్లీన్



మేడారంలోని ఆర్టీసీ బస్టాండ్ జాతరకు సిద్ధమవుతోంది. 40 ఎకరాల్లో ఉన్న బస్టాండ్ ప్రదేశాన్ని డోజర్లతో చదును చేసి శుభ్రం చేశారు. అలాగే, బస్టాండ్‌లో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతరలో విధులు నిర్వర్తించే సిబ్బంది కోసం తడకలతో గదులు ఏర్పాటు చేస్తున్నారు.

బోరుబావుల నిర్మాణం



మేడారంలో ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల తాగునీటి సౌకర్యార్థం జాతర పరిసరాల్లో 40 బోరుబావులు వేస్తున్నారు. 250 చేతి పంపుల బోర్లను ఫ్లషింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా జాతరలో భక్తుల కోసం తాత్కాలికంగా 5,600 జీఐ షీట్స్ మరుగుదొడ్ల నిర్మాణాల కోసం కాంట్రాక్టర్లు మెటీరియల్ సిద్ధం చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాల్లో భాగంగా బేస్‌మెంట్ల కోసం కందకాలు తవ్వుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశ్, ఈఈలు సుభాష్, రామంజనేయులు, డీఈ వెంకట సతీష్ పరిశీలించారు. ఈసారి జాతరలో భక్తులకు మిషన్ భగీరథ నీటిని అందజేస్తామని ఎస్ఈ మల్లేశ్ తెలిపారు. లక్ష్యం మేరకు పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు.

పార్కింగ్ ఏర్పాట్లు

భక్తుల వాహనాల నిలుపుదల కోసం పీఆర్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పార్కింగ్ పనులు జోరందుకున్నాయి. జాతరకు భక్తులు ప్రైవేట్ వాహనాల్లో లక్షలాదిగా తరలివస్తారు. పస్రా నుంచి మేడారం, కాటారం, బోర్లగూడెం, కాల్వపల్లి మీదుగా భూపాపల్లి నుంచి బయ్యక్కపేట మీదుగా మేడారానికి వస్తుంటారు. ట్రాఫిక్ నియంత్రణకు ఈ దారుల్లో వచ్చే భక్తుల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు, వెంగ్లాపూర్, నార్లాపూర్, ఊరట్టం, కన్నెపల్లి, శివరాంసాగర్ సమీపంలోని వీవీఐపీ, వీఐపీ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. ఊరట్టం ప్రాంతంలో మూడు మోడల్ పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు డీఈ రవీందర్ తెలిపారు. పార్కింగ్ స్థలాలు ఏఈ వాసు దగ్గరుండి చేయిస్తున్నారు.



జాతరలో శాశ్వత సీసీ కెమెరాల ఏర్పాటు

ఏటూరునాగారం: మేడారం జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో భక్తుల భద్రతాచర్యల్లో భాగంగా ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు మేడారంలో 78 శాశ్వత సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో సీసీ కెమెరాలు కేవలం జాతర సమయంలోనే ఉండేవి. ప్రస్తుతం ఆ కెమెరాలను నిరంతరం చేశారు. మేడారం ఐలాండ్, ఐటీడీఏ గెస్ట్‌హౌస్, జంపన్నవాగు, బస్టాండ్, రెడ్డిగూడెం, క్యూలైన్లు, చిలకలగుట్ట వైపు సీసీ కెమెరాలను అమర్చారు. ఓఎఫ్‌సీ ద్వారా లింక్ చేసి ఎల్‌ఈడీ స్క్రీన్లలో నిత్యం పర్యవేక్షణ చేయనున్నారు.

గద్దెల వద్ద 18 కెమెరాలు

గద్దెల వద్దకు వనదేవతలకు మొక్కులు సమర్పించేందుకు వస్తున్న భక్తుల సొమ్ము, డబ్బులు, సెల్‌ఫోన్‌లు కాజేసే అవకాశం ఉండడంతో చోరీలకు అడ్డుకట్టు వేసేందుకు 18 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చోరీలను అరికట్టేందుకు పోలీసులు నిఘా నేత్రాలను ఉపయోగించనున్నారు. అంతేకాకుండా భక్తుల రద్దీని సైతం నియంత్రించేలా పర్యవేక్షణ చేస్తూ అనౌన్స్‌మెంట్ కూడా చేస్తున్నారు. అయితే జాతరకంటే ముందు బుధ, ఆదివారాల్లో భక్తులు పెద్ద ఎత్తున వస్తుండడంతో ఈ కెమెరాలను అప్‌గ్రేడ్ చేశారు. దీంతో కొంత మేర ప్రమాదాలు, చోరీలను అరికట్టే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.


గద్దెల ఎదుట ఐలాండ్ వద్ద సీసీ కెమెరాలు అమర్చుతున్న అధికారులు

దంపతుల మధ్య గొడవ..

- క్షణికావేశంలో పురుగుల మందు తాగిన ఇద్దరు
- ఎంజీఎంలో చికిత్స.. భార్య పరిస్థితి విషమం
- మంచ్యతండాలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న దంపతులు పరమేశ్వర్, సరిత

మరిపెడ రూరల్: ఇద్దరి మధ్య జరిగిన గొడవ కారణంగా క్షణికావేశంలో దంపతులు పురుగుల మందు తాగారు. ఇందులో భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట శివారు మంచ్యతండాలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ పరమేశ్వర్, సరిత 6 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వ్యవసాయ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 8వ తేదీన మిర్చి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న క్రమంలో గొడవ పడ్డారు. దీంతో ఆగ్రహం చెందిన పరమేశ్వర్ ముందు పురుగు మందు (కలుపుమందు) తాగాడు. అనంతరం సరిత కూడా తాగింది. చుట్టు పక్కల వారు గమనించి ఇద్దరినీ మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సరిత పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ దంపతులకు కూమారుడు, కూతురు ఉంది.

సాయిచరణ్‌కు చేయూత

సాక్షి స్పందన

బయ్యారం: కూల్‌డ్రింక్ అనుకుని గడ్డిమందును తాగిన బాలుడు సాయిచరణ్ వైద్యఖర్చులకు సాయం చేసేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'కూల్‌డ్రింక్ అనుకుని.. గడ్డిమందు తాగిన బాలుడు' అనే కథనానికి దాతలు స్పందించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట రెసిడెన్షియల్ పాఠశాల పూర్వ విద్యార్థులు రూ. 12 వేలు, ఇతర రంగాలకు చెందిన వారు రూ. 6 వేల వరకు ఫోన్ పే ద్వారా సాయిచరణ్ తల్లిదండ్రులకు పంపించారు. దీనిపై సాయిచరణ్ తల్లిందడ్రులు దాతలకు కృజ్ఞతలు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


నర్సయ్య (ఫైల్)


తరిగొప్పుల: మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్ర శివారు కనీలకుంటలో జరిగింది. కనీలకుంటకు చెందిన కలకుంట్ల నర్సయ్య(55) గత ఆదివారం గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లాడు. ఈ క్రమంలో తమ తండ్రి అనారోగ్యానికి నర్సయ్యనే కారణమని అదే గ్రామానికి చెందిన తుపాకుల శ్రీకాంత్, తుపాకుల సాంబరాజు.. నర్సయ్య దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన నర్సయ్య వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

మంగళిబండతండాలో మరో వ్యక్తి..

రఘునాథపల్లి: అవమానభారంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మంగళిబండతండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూడ్ సోమ్లా (40) కుమారుడు యాదగిరి ఇటీవల వివాహమైన ఓ మహిళను ప్రేమించి ఇంటికి తీసుకెళ్లాడు. సదరు మహిళ కుటుంబ సభ్యులు ఈ నెల 6న సోమ్లా ఇంటి వద్ద గొడవ చేసి ఆ వివాహితను తమ వెంట తీసుకెళ్లారు. దీంతో అవమానకరంగా భావించిన సోమ్లా.. పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని మంగళవారం ఇంటికి తీసుకురాగా అదే రోజు రాత్రి ఆరోగ్యం క్షీణించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు రైతు బలి

- పెగడపల్లిలో ఘటన


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న సీఐ రంజిత్, ఎస్సై వెంకటేశ్వర్

ములుగు రూరల్: అడవి జంతువుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు రైతు బలయ్యాడు. ఈ ఘటన మండలంలోని పెగడపల్లిలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మీనుగు సాంబయ్య(42) తన భార్య మణెమ్మతో కలిసి మంగళవారం రాత్రి పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో వ్యవసాయ బావి వద్ద ఉన్న మోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో ట్రాన్స్ ఫార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడ అడవి జంతువుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. భర్త విద్యుత్ షాక్‌కు గురి కావడంతో మణెమ్మ గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులకు సమాచారం అందించింది. దీంతో వారు అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. గ్రామస్తులు వెళ్లి చూడగా సాంబయ్య అపస్మారక స్థితితో ఉండగా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు.

ఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు..

అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి చెందిన విషయం తెలుసుకున్న సీఐ రంజిత్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్, విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదతీరును పరిశీలించారు. విద్యుత్ తీగలు ఎవరు అమర్చారనే విషయంపై ఆరా తీశారు. దుబ్బగూడెం గ్రామానికి చెందిన ఈసం ముత్తారావు, అశోక్, లక్ష్మీనర్సు, ఆగబోయిన లక్ష్మయ్య, ఆలూరి ప్రశాంత్‌లు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- మధ్యప్రదేశ్ మాజీ సీఎం చౌహాన్
- నాయకులకు దిశానిర్దేశం


మాట్లాడుతున్న మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్

హన్మకొండ/హనుమకొండ కల్చరల్/హసన్‌పర్తి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు పార్టీకి కీలకమని, ప్రజలను బీజేపీ వైపు ఆకర్షితులను చేయాలన్నారు.

అమ్మవారి దర్శనం

భద్రకాళి దేవాలయాన్ని బుధవారం మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ ఈఓ, అసిస్టెంట్ కమీషనర్ శేషభారతి, అర్చకులు శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు.

ఆకలి లేని రాజ్యమే 'రామరాజ్యం'

రామరాజ్యం అంటే ఆకలి, అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండే రాజ్యమని శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. హసన్‌పర్తిలో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. మీరంతా నాకు అక్కలు, అన్నలు, చెల్లెలు, మేన కోడళ్లు, మేనళ్లులు అని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి ఆకర్షించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు వి.మురళీధర్‌గౌడ్, తాళ్లపల్లి కుమారస్వామి, రావు పద్మ, కొండేటి శ్రీధర్, ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్, మార్తినేని ధర్మారావు, విజయ రామారావు అధికారుల తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ చేపట్టాలి


ధర్నా చేస్తున్న ఎల్ఐసీ అధికారులు, ఉద్యోగులు

హన్మకొండ: ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ చేపట్టాలి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ వరంగల్ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద ఎల్ఐసీ ఉద్యోగుల ఐక్య ఫ్రంట్ ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ధంగా ఎల్ఐసీ ఉద్యోగులకు రావాల్సిన వేతన సవరణను కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం తాత్సారం చేయడం శోచనీయమన్నారు. ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన చార్టర్ ఆఫ్ డిమాండ్ సమర్పించి 18 నెలలు కావొస్తున్నా యాజమాన్యం చర్చలకు పిలవకపోవడంతోనే ఉద్యోగులు సమ్మె బాట పట్టారన్నారు. ఎల్ఐసీ రూ.47 లక్షల కోట్ల నికర ఆస్తులు కలిగి ఉందన్నారు. నూతన వ్యాపారంలో రూ.7.88 లక్షల కోట్లు ఆర్జించిందని తెలిపారు. క్లాస్ వన్ అధికారుల సంఘం అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ఎల్ఐసీ ఎంతో ప్రగతి సాధిస్తూ ప్రపంచంలో మేటి సంస్థగా వెలుగొందుతుందన్నారు. ప్రగతిలో పాలుపంచుకున్న ఉద్యోగులు మెరుగైన వేతన సవరణకు అర్హులన్నారు. కానీ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం, నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. వెంటనే చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూయూఐ వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రావు, క్లాస్ వన్ అధికారుల సంఘం వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మంజుల, నాయకులు కే.నాగభూషణం, ఎ.చంద్రశేఖర్, రేష్మ, కల్యాణి, స్వరూప, సంధ్య, లీల కుమారి, కవిత రవిరాజ్, రజని, వైజయంతి, లక్ష్మి పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తాం

- పీసీసీఎం కె.రవీన్‌కుమార్‌రెడ్డి

కేసముద్రం: మూడో లైన్ పని జరిగే సమయంలో ప్రయాణికులకు ఫుల్‌కవరేజ్ షెడ్లు, ప్లాట్‌ఫాం ఎక్స్‌టెన్షన్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్స్ ఆఫీసర్ (పీసీసీఎం) కె.రవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం కేసముద్రం రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, రైల్వే స్టేషన్‌లో డిస్‌ప్లే బోర్డులు, రెండో ప్లాట్‌ఫాంపై బుకింగ్ కౌంటర్, పలు రైళ్ల హాల్టింగ్ ఏర్పాటు చేయాలని వ్యాపారులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. దీనిపై పీసీసీఎం సానుకూలంగా స్పందించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ పీసీసీఎం భాస్కర్, డీసీఎం బస్వరాజ్, స్థానికులు ఓలం శ్రీను, ఓలం రాజు, పొదిల నర్సింహారెడ్డి, తేరాల శ్యాం, భూపాటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


కేసముద్రం : సూచనలిస్తున్న పీసీసీఎం

వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆధునీకికరణ పనుల పరిశీలన

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) కె. రవీన్‌కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ పథకం ద్వారా స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకికరణ పనులు పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ పీసీసీఎం భాస్కర్, సీనియర్ డీసీఎం బసవరాజు, స్టేషన్ మేనేజర్ బాలరాజు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

వరంగల్ చౌరస్తా : సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తామని ఏఐసీటీయూ కేంద్ర కమిటీ కార్యదర్శి ఎస్. ప్రతాప్ తెలిపారు. బుధవారం వరంగల్ అండర్ బ్రిడ్జి ఎంసీపీఐ(యూ) ఓంకార్ భవన్‌లో అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం(ఏఐసీటీయూ) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఏఐసీటీయూ నాయకుడు తుడుం అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్ర కమిటీ కార్యదర్శి ఎస్.ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులు ప్రోత్సహిస్తూ దేశ సంపదను పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి యజమానులకు లాభాలు చేకూర్చేలా నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను హరిస్తోందని పేర్కొన్నారు. అందుకే కార్మికులను చైతన్యం చేసి హక్కులు సాధించుకోవడానికి ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐసీటీయూ రాష్ట్ర నాయకులు ఎస్. జగదీశ్వర్, జబ్బర్ నాయక్, కర్ర దానయ్య, జి.శివాని, భద్రయ్య, ఉపేందర్, జె.నర్సయ్య, ఎ. మల్లికార్జున్, వి. ఆశీర్వాదం, మోహన్ నాయక్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రతాప్

వ్యాయామ అధ్యాపకులకు పదోన్నతి కల్పించాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించాలని తెలంగాణ డిగ్రీ కళాశాలల వ్యాయామ అధ్యాపకుల సంఘం (టీడీసీపీఈటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ సోమన్న, కార్యదర్శి డాక్టర్ బాలరాజు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల పదోన్నతులకు కావాల్సిన సంబంధిత పీజీ, పీహెచ్‌డీ, డిగ్రీ కళాశాలల్లో 15 ఏళ్లపాటు అధ్యాపకుడిగా అనుభవం ఉన్నప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీఓ నంబర్ 47ను సాకుగా చూపి వ్యాయామ అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి ఇవ్వకపోవటం బాధాకరమని వాపోయారు. జీఓను సవరించి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుల సంఘం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్.రాజారావు, సలహాదారుడు డాక్టర్ సిద్ధ జగన్మోహన్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

పరీక్ష కేంద్రాల పరిశీలన

కేయూ క్యాంపస్: కేయూ పరిధి డిగ్రీ, పీజీ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆయా పరీక్ష కేంద్రాలను బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి సందర్శించారు. పరీక్షల నిర్వహణను పరిశీలించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, మాస్టర్‌జీ, సిటీ మహిళా కాలేజీ, గీతాంజలి, మహిళా పీజీ కాలేజీల్లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. క్యాంపస్‌లోని బయోటెక్నాలజీ విభాగంలో పీజీ మూడో సెమిస్టర్ పరీక్షల తీరును కేయూ వీసీ రమేశ్ పరిశీలించారు.

నలుగురు డీబార్


కేయూలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ రమేశ్

వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ నలుగురు డీబార్ పట్టుబడినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు. వారిని డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.